క్లుప్తంగా

ఏసు మంచి కాపరి



ఫిరంగిపురం: దయామయుడు ఏసుక్రీస్తు మంచి కాపరి అని సహాయవిచారణ గురువులు ఆర్.అనిల్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో దైవపిలుపుల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ నా గొర్రెలు నాస్వరమును వింటాయని ఏసుక్రీస్తు పలికాడని చెప్పారు. దేవుడి స్వరమును వినాలంటే మన మనస్సును క్రీస్తు వైపునకు లగ్నం చేయాలని దానిద్వారా ఆయన ఆశీస్సులు లభిస్తాయని తెలిపారు. దేవుడు ఇచ్చిన దానిని ఆయనకే మనం తిరిగి సమర్పించాలన్నారు. గురువిద్యార్థులు ఆప్రభువు మందలోని వారుగా జీవించాలని చెప్పారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు పి.బాలస్వామి, డీకేఎస్ బాల పాల్గొన్నారు.

నాక్ ఏ ప్లస్ ర్యాంక్ సాధనే లక్ష్యం కావాలి

వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

ఏఎన్‌యూ: న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిడేషన్ కౌన్సిల్) పర్యటన నేపథ్యంలో యూనివర్సిటీలోని అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బందితో ఆదివారం వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు నాక్ సభ్యుల బృందం ఏఎన్‌యూలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని వర్గాలు సంసిద్ధంగా ఉండాలన్నారు. నాక్ పర్యటన కోసం ఇప్పటివరకు విభాగాలు సహకరించిన తీరు అభినందనీయమన్నారు. ఆయా విభాగాలు సాధించిన ప్రగతిని క్షేత్రస్థాయిలో సమగ్రంగా వివరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి విభాగం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ విభాగం వివరాలను కమిటీ సభ్యులకు సూచించాలని తెలిపారు. అనంతరం విభాగాల్లో ఉన్న లేబొరేటరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్‌లను చూపాలన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ప్రిన్సిపాల్స్ సీహెచ్ స్వరూపారాణి, సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఆచార్య సంధ్యకోల్, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ గోపీకృష్ణ, డైరెక్టర్లు, విభాగాధిపతులు, కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- లాంలో ఎన్నికల ప్రచారం

లాం(తాడికొండ): రాష్ట్రంలో అన్ని వర్గాలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలోనే మేలు జరిగిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు. ప్రజలు సుచరితకు ఘనస్వాగతం పలికారు. జొన్నలగడ్డ అడ్డ రోడ్డు కూడలి నుంచి భారీ ర్యాలీగా గ్రామానికి చేరుకున్నారు. తొలుత లాం సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలు ఎవరూ చేయని, ఊహించని విధంగా గడప గడపలో సంక్షేమం అందించిన జగనన్నకు ప్రజాదరణ ఏ మాత్రం తగ్గదన్నారు. ఆయనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలకు దిగుతూ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. 14 సంవత్సరాల పాలనలో ప్రజలకు మేలు చేసే పని ఒక్కటైనా బాబు చేశాడేమో ఆత్మవిమర్శ చేసుకొని ప్రజలను ఓట్లు అడగాలని కోరారు. ప్రజలు తనని నమ్మడం లేదని గ్రహించిన చంద్రబాబు కూటమి పేరుతో పవన్ కల్యాణ్, బీజేపీ ముసుగులో ఉన్న బాబు కోవర్టులను వెంటబెట్టుకొని గెలుపు కోసం నానా తంటాలు పడుతున్నాడని ఎద్దేవా చేశారు. చెప్పిన మాట చెప్పినట్లుగా చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల హామీల ద్వారా ప్రతి ఇంటా సంక్షేమ సిరులు కురిపించారని, అందుకే ప్రజలు ఆదరణ చూపిస్తూ ఆయనకు మళ్ళీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జగనన్న ప్రజల గుండెల్లో ఉన్నారని, 175/175 సీట్లలో గెలిచి ప్రతిపక్ష పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీలు రావూరి దివ్య, వలపర్ల కల్పన, బోడపాటి సుశీల, షేక్ హుస్సేన్, నాయకులు తాళ్ళల శివనాగరాజు, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, నిడుముక్కల సర్పంచి మాదాసు రత్నకుమారి, వివిధ విభాగాల నాయకులు రాయపూడి రంగారావు, షేక్ ఆదిల్, షేక్ సాదిక్, మీర్జావలి, రావూరి నరేష్, బెజ్జం సాయి ప్రసాద్, షేక్ నూర్జహాన్ పాల్గొన్నారు.



లాంలో ఎన్నికల ప్రచారానికి హాజరైన ప్రజలు (ఇన్‌సెట్) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మంగళగిరి: నియోజకవర్గ కేంద్రం మంగళగిరిలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించే దిశగా అర్బన్ సీఐ శ్రీనివాసరావు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. ప్రధాన రహదారి గౌతమబుద్ధా రోడ్డును విస్తరించినప్పటికీ సమస్యాత్మక ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ప్రజలు, వాహనదారులు గాయాల పాలవుతున్నారు. పలు సందర్భాల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన ఘటనలు లేకపోలేదు. ప్రమాదాలను నివారించాలంటే వేగనియంత్రణను అదుపు చేయాల్సిన అవసరం ఉందని పోలీసులు గుర్తించారు. వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేస్తే మేలని అర్బన్ సీఐ శ్రీనివాసరావు భావించారు. ఓ పక్క సార్వత్రిక ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ కొత్త బోర్డులను తెప్పించి దాతల సహకారంతో వాటిని సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న కూడళ్లలో ఈ బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించడంతో పాటు ప్రమాదాలను అదుపు చేయడం జరుగుతుంది. ప్రమాదాలను నివారించడం ద్వారా ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే లక్ష్యమని సీఐ తెలిపారు.



బోర్డులను పరిశీలిస్తున్న అర్బన్ సీఐ శ్రీనివాసరావు

నేడు కొత్తపేటలో లావణ్య ఎన్నికల ప్రచారం

మంగళగిరి: నగరంలోని కొత్తపేటలోని పార్వేట మండపం వద్ద వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నీరుకొండ, బేతపూడి బాబూజీ నగర్‌లో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొంటారు.

చంద్రబాబుపై పోలీసులకు ఫిర్యాదు!

- అమరావతి ఉద్యమం నా ఆలోచనకు ప్రతి రూపం
- అయినా చంద్రబాబు పట్టించుకోలేదు
- పొలిటికల్ కన్సల్టెంట్ పోలవరపు రాకేష్‌కుమార్ వెల్లడి



మంగళగిరి: అమరావతి రైతుల ఉద్యమం నా ఆలోచనకు ప్రతి రూపమని, అయినా చంద్రబాబు తనను పట్టించుకోవడం లేదని పొలిటికల్ కన్సల్టెంట్ పోలవరపు రాకేష్‌కుమార్ విమర్శించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనను సంప్రదించకుండా ఉద్యమం చేపట్టడంపై శనివారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ అశోక్ కుమార్, ఏపీ రాజగోపాల్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య

మంగళగిరి: అర్హులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతోందని ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. ఆదివారం నగరంలోని 25వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు ఆమెకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సంక్షేమ పాలనతో ప్రజల హృదయాల్లో జగనన్న నిలిచిపోయారని కొనియాడారు. రాష్ట్రంలో లక్షలాది మందికి నెల నెలా పెన్షన్ల రూపంలో కోట్లాది రూపాయలను నేరుగా లబ్దిదారులకు అందజేయడం ఏ రాష్ట్రంలోనూ లేదన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జగనన్నకు ప్రతి ఒక్క రూ అండగా నిలబడి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఘన విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నట్లు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. ఆదివారం రాత్రి తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం రాధా రంగా నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, బీసీ సెల్ నియోజకవర్గ నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), వడ్డేశ్వరం కన్వీనర్ గొడవర్తి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. రాధా రంగానగర్‌లో రోడ్‌షో నిర్వహించి, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కృషితో వడ్డేశ్వరంలో పలు రహదారులు నిర్మించడమే కాకుండా, రైతులు పడుతున్న కష్టాలను ఒక రైతుగా ఆయన గమనించి రైతులు పంటపొలాలకు వెళ్లేందుకు, ఎగుమతులు చేసేందుకు రహదారులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మళ్లీ వైఎస్సార్ సీపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంగళగిరి జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రరావు, ఎస్‌కే మీరాషా, రవి, మాజీ సర్పంచి చినరంగా షరీఫ్ పాల్గొన్నారు.



మంగళగిరిలో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తున్నాం

తాడేపల్లిరూరల్: పట్టణంలో పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణ పరిధి లోని ముగ్గురోడ్డు ప్రాంతంలోని 14వ వార్డు, పోలకంపాడు 18వ వార్డులో లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాడేపల్లి కొండ ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రతి ప్రాంతంలో తాగునీటి పైపులైన్లకు ప్రత్యేక మోటార్లు ఏర్పాటు చేసి కొండ చివరి భాగంలో ఉన్న వారికి కూడా తాగునీటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీరోజ, జేసీఎస్ కన్వీనర్ గోపి, తిరుపతి శ్రీనివాసరావు, కస్తూరి అమర్, కూరగంటి ఉదయరాజు, బత్తుల వెంకటేశ్వరరావు, గుంజ అంబారావు, కొండ, మైల రవీంద్ర, డి. శ్రీకాంత్, బి.వి. రావు,వి. వెంకయ్య, వి. అంజి, నారాయణ, భవాని శంకర్, కృష్ణారెడ్డి, కె.వంశీ, టి.సాయికీర్తి, చింటూ, యూసఫ్ పాల్గొన్నారు.



తాడేపల్లి 14వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాలసోమిరెడ్డి



వడ్డేశ్వరంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య